క్లుప్తంగా

లింగాలకు 1810 క్వింటాళ్ల సబ్సిడీ శనగలు మంజూరు

లింగాల : మండలంలో రబీ పంటల సాగు కోసం 1810 క్వింటాళ్ల సబ్సిడీ బుడ్డశనగలు మంజూరైనట్లు ఏఓ రమేష్ తెలిపారు. 40 శాతం సబ్సిడీతో రైతులకు బుడ్డశనగలు అందిస్తారని ఆయన అన్నారు. ఒక్కో రైతుకు విస్తీర్ణాన్ని బట్టి కనిష్టంగా 25 కిలోల నుంచి గరిష్టంగా 200 కిలోల వరకు ఎకరాకు 40 కేజీల చొప్పున 5 ఎకరాలలోపు విస్తీర్ణం వరకు బుడ్డశనగలు అందిస్తారన్నారు. కావాల్సిన రైతులు శనివారం నుంచి వారి పరిధిలోని ఆర్బీకే కేంద్రాలలో వారిపేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. శనగలు క్వింటా పూర్తి ధర రూ.8100 లు కాగా, 40 శాతం సబ్సిడీ రూ.3240లు పోనూ రైతులు రూ.4860లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

నిడుజివ్విలో ప్రజాదర్బార్

ఎర్రగుంట్ల : మండలంలోని నిడుజివ్విలో శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించారు. అనంతరం జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ నాయకులతో చర్చించి సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు.

స్వచ్ఛతను పాటించాలి



కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలోని ప్రతి ఒక్కరూ తమ వంత కర్తవ్యంగా ఎర్రగుంట్లను స్వచ్ఛతగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం పాత మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన పారిశుద్ధ్య కార్మికులచే చెత్తను సేకరించి, ఇంటి పరిసర ప్రాంతాలను వీధులను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, తదితరులు పాల్గొన్నారు,

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చెన్నూరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భవ' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సీజన్‌లో ఎక్కువగా విష జ్వరాలు, జలుబు, దగ్గు, కండ్ల కలక ఎక్కువగా వస్తోందని ప్రజలు తమ ఇళ్ల చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. అన్ని రకాల మందులతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

వేంపల్లి : స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆవోపా మండల అధ్యక్షుడు పుల్లగూర గోవర్ధన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కడపకు చెందిన ప్రముఖ సీనియర్ వైద్యనిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు అన్నదానం

పులివెందుల టౌన్ : స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న గిరి టీస్టాల్ యజమాని పి.దస్తగిరి స్మారకార్థం ఆయన సతీమణి పద్మావతి దివ్యాంగులకు మాంసాహారంతో కూడిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి శనగవిత్తనాల పంపిణీ

ముద్దనూరు : ప్రస్తుత రబీ సీజనుకు గాను మండలానికి 1020 క్వింటాళ్ళ శనగలు మంజూరయ్యాయని శనివారం నుంచి విత్తనాల పంపిణీ ప్రారంభిస్తామని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. 40 శాతం రాయితీతో ఆయా గ్రామాల వారీగా రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వేంపల్లె : స్థానిక తలిశెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ ఉన్నత (బాలురు) పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో కలిసి అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డిలను సన్మానించారు. కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ తరఫున ఎంపిక చేయడం సంతోషదాయకమన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం



పెండ్లిమర్రి : వైద్యశిబిరాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్



జమ్మలమడుగు : వైద్య శిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్‌సుధీర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు గొప్ప వరంలాంటిదని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లెలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన రోగులకు మందులను పంపిణీ చేశారన్నారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు 15 రోజుల నుంచి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని ఇంటి వద్దనే బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సతీష్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. మండలంలోని గుర్రాలచింతపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యుడు వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : జగనన్న ఆరోగ్య సురక్ష నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎటువంటి ఖర్చులేకుండా నిరుపేదలకు ఇంటివద్దకే వచ్చి మంచి వైద్య పరీక్షలను నిర్వహించడంతోపాటు, అనారోగ్యంగా ఉన్నవారికి మెరుగైన చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఇలాంటి కార్యక్రమం దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొని వైద్యశిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి నాణ్యమైన వైద్యం ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మాజీ ఎంపీపీ గిరిధర్‌రెడ్డితో కలిసి ఈవైద్యశిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఉచితంగా వైద్య అందిస్తున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరు గ్రామసచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ నాగరాజు పరిశీలించి మాట్లాడారు. అనంతరం వైద్యులకు వైద్య సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వీ బ్రహ్మయ్య, ఎంపీడీఓ రహమత్తులయ్య, తాహసీల్దార్ ఎ. నాగేశ్వరరావు, మండల వైద్యాధికారులు, గ్రామ సర్పంచ్ అంబటి పార్వతమ్మ, మాజీ ప్రభుత్వ సలహాదారులు అంబటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం గంగవరం గ్రామ సచివాలయంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలాగే శిబిరానికి వచ్చిన రోగులను వైద్యులు పరీక్షించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్రారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీ నారాయణరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు హిరామియ తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ షంషాద్ బేగం, వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండలంలోని మహదేవపల్లె జడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి పరిశీలించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతి వ్యక్తి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ మాధవీబాలకృష్ణ, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, వైద్యులు వినయ్‌కుమార్, ప్రవీణ్‌ఆనంద్, శివప్రసాద్, వాణి, లావణ్య, తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపీడీవో శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని కోట్లూరు గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మొత్తం 310 మందికి వైద్య సేవలను అందించినట్లు వైద్య నిపుణులు తెలిపారు. 10 మందిని ఉన్నత స్థాయి వైద్య సేవలకై రెఫర్ చేశామన్నారు. అనంతరం మందులను, ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ గ్రామంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్యం అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ప్రతి గడప వద్దకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం అందించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, సర్పంచ్ నాగమ్మ, ఉపసర్పంచ్ కోలా శ్రీరాములు, ఎంపీటీసీ గంగరత్నాలు, వైకాపా యువనేత కావలికృష్ణతేజ, సచివాలయ కన్వీనర్లు, వార్డు సభ్యులు, డిప్యూటీ తహసీల్దార్ శివలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



పులివెందుల : కొత్తపల్లెలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



ఎర్రగుంట్ల : తిప్పలూరులో వైద్యులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు



చక్రాయపేట : వైద్యకిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వల్లూరు : కోట్లూరులో వైద్య సేవలందిస్తున్న వైద్య నిపుణులు

రుణాలను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు : డ్వాక్రా సంఘాల మహిళలు వైఎస్ఆర్ క్రాంతి పథం ప్రాజెక్ట్ నుంచి పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌరి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సమాఖ్య వార్షిక మహాసభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి వైఎస్ఆర్ కేపీ సిబ్బంది కృషి చేయాలని ఏపీఎం శైలజ తెలిపారు. అనంతరం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా జీ సుహాషిణి, ఉపాధ్యక్షురాలుగా టీ శ్రీదేవి, కార్యదర్శిగా వై.ఈశ్వరమ్మ, ఉప కార్యదర్శిగా ఎన్.రమాదేవి, కోశాధికారిగా జీ పార్వతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కేపీ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, ఎల్‌సీ సీసీ, సిబ్బంది, వీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశు

లింగాల : మండలంలోని దొండ్లవాగు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న మైనింగ్‌పై శుక్రవారం ఆర్డీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గ్రామానికి చెందిన విద్యానందరెడ్డి నిర్వహిస్తున్న మైనింగ్ సర్వే నెంబరు 426/పి, 380/పి సర్వే నెంబర్లలో 13.912 హెక్టార్లలో 380/4పి, 380/2 సర్వేనెంబర్లలో 2.340 హెక్టార్లలో మొత్తం 16.252 హెక్టార్ల విస్తీర్ణంలో మైనింగ్ నిర్వహిస్తున్నామని దీనిపై గ్రామ ప్రజలకు ఏవైనా అభ్యంతరాలున్నాయా.. అన్న విషయంపై ఆర్డీఓ, మైనింగ్ ఏడీ, ఈఈ, మైనింగ్ ఆర్డీఓలు గ్రామ ప్రజలను మైనింగ్ వద్ద సమావేశపరచి ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో మైనింగ్ డిపార్టుమెంట్‌కు చెందిన ఆర్డీఓ వెంకటే శు, పొల్యూషన్ డిపార్టుమెంట్‌కు చెందిన ఈఈ అశోక్‌లు ప్రజల అభిప్రాయాలను సేకరించారు. గ్రామానికి చెందిన సర్పంచ్, ఎంపీటీసీలు మైనింగ్ నిర్వహణ వల్ల మాకు ఎలాంటి అభ్యంతరంలేదని ధృవీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మినారాయణ, డీటీ త్రిభువన్‌రెడ్డి, మైనింగ్ నిర్వాహకులు విద్యానందరెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు నిధులు

ప్రొద్దుటూరు : ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు పరిధిలోని వాసవి సర్కిల్ నుంచి సినీ హబ్ మీదుగా రిలయన్స్ పెట్రోలు బంకు వరకు రోడ్డు విస్తరణకు సుమారు రూ.6కోట్లు నిధులు అవసరమవుతాయని సంబంధిత అధికారులు అంచనా వేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మున్సిపల్ కమిషనర్, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులతో కలసి రోడ్డును పరిశీలించారు. దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డును విస్తీర్ణాన్ని బట్టి వంద అడుగుల వరకు విస్తరించేందుకు పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు రెండు వైపులా 15 అడుగుల చొప్పున రోడ్డును విస్తరించేందుకు సుమారు రూ.5కోట్లు నిధులు అవసరమవుతాయని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారన్నారు. అడ్డుగా ఉన్న 16 ట్రాన్స్‌ఫార్మర్లు, 173 విద్యుత్ స్తంభాలను మార్చేందుకు రూ.కోటి అవసరమవుతుందని తెలిపారన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహారెడ్డి, డీఈఈ లక్ష్మీనరసింహులు, ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులరెడ్డి, ఏడీఈ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి పాల్గొన్నారు.

నేత్రదానం

పులివెందుల రూరల్ : తిరుపతి పట్టణంలోని సుధాకర్‌రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న ఉమ్మడి నిర్మలమ్మ గురువారం రాత్రి మరణించారు. నేత్రాలను దానంచేయాలన్న లక్ష్యంతో ఆమె కుమారుడు స్వామిరెడ్డి నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షులు రాజుకు సమాచారం అందించారు. ఆమె కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రికి పంపించామని ఈ సందర్భంగా రాజు తెలిపారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్

వేంపల్లె : భారతీయ జనతాపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గాలి హరిప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : నగర పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగ వంతం చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మార్పురి మేరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 8 అంశాలపై చర్చించగా ఆరు అంశాలను ఆమోదించారు. రెండు అంశాలను వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురంను నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత రూ.36 కోట్లతో డ్రైనేజ్ పనులు చేపట్టామన్నారు. అలాగే ప్రస్తుతం దాదాపు రూ.100 కోట్లతో మంచినీటి పైప్‌లైన్ పనులు, రోడ్డు విస్తరణ, బ్యుటిఫికేషన్, మున్సిపల్ కార్యాలయ భవనం, సీసీ రోడ్లు తదితర పనులు జరుగుతున్నాయన్నారు. అయితే ఈ పనుల్లో జాప్యం లేకుండా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి పనుల్లో వేగం పెంచాలన్నారు. ఇప్పటికే ఆసుపత్రి, పాలిటెక్నిక్ భవనాలు ప్రారంభించామన్నారు. కమలాపురం గ్రామ పంచాయతీ అయితే నిధులు తక్కువగా వస్తాయని, అందుకే నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసామన్నారు. ఆర్‌ఓబీ, బైపాస్ కూడా త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

కమలాపురంలో అభివృద్ధి జరగడం లేదనడం హాస్యాస్పదం..

కమలాపురం నగర పంచాయతీలో కోఆప్షన్ సభ్యుడిగా ఉన్న రెడ్డి కరీంకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం కల్పించామన్నారు. అయితే అతను కమలాపురంలో అభివృద్ధి జరగడంలేదని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. పట్టణంలో అతనే రూ.కోటి పనులు చేసిన విషయం అతనికి తెలుసన్నారు. అయితే అతని బంధువులంతా టీడీపీలో ఉండటంతోనే అతను అక్కడికి వెళ్తున్నాడని, వెళ్లే సమయంలో తమ పార్టీపై బురద జల్లడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్ బాధించిందని చెప్పడం అతని అవివేకం అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సాదిక్, శ్రీనివాసరెడ్డి, టౌన్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, కమిషనర్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : కమలాపురం క్లస్టర్ పరిధిలో అర్హులైన 12 మందికి రైతులకు జలకళ పథకం ద్వారా శనివారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మోటర్లు అందిజేస్తారని డ్వామా ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో కమలాపురం, వల్లూరు, సీకే దిన్నె, పెండ్లిమర్రి మండలాలకు చెందిన 12 మంది రైతులకు ఈ మోటర్లు అందిస్తున్నామని, ఒక్కో యూనిట్ ధర రూ.1.90 లక్షలు ఉంటుందన్నారు.

నేడు చింతకొమ్మదిన్నెకు..

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీలో శనివారం జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష అలాగే నాగిరెడ్డిపల్లి మెయిన్ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డిలు హాజరవుతున్నట్లు మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అభిమానులు పాల్గొనాలని ఆయన తెలిపారు.

గ్రామ కార్యదర్శికి సన్మానం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామ సచివాలయం-1 గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనువాసులుకు ఈవోపీఆర్డీగా పదోన్నతి రావడంతో ఆయనను చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో ప్రభుత్వం నియమించింది. గ్రామస్తులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, సర్పంచ్ కటారు నిర్మల, వైస్ సర్పంచ్ బాపతి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పేద ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక నగరిగుట్ట సచివాలయ పరిధిలోని చిన్నన్న రూములు, నగరిగుట్ట, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం రాగానే మొట్టమొదటిగా ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని ప్రజలను కోరారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తే అన్నివర్గాల ప్రజలకు మరిన్ని పథకాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కో ఆప్షన్ చంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఏఎస్‌ఐ చంద్రశేఖర్ స్వామి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి




మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి

తొండూరు : ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర శాప్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభాభవనంలో ఎంపీపీ నారాయణమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రజలకు ఏ సమస్యలున్నా అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికారులు, నాయకులు సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. అలాగే అధికారులు కూడా పంటల విషయంలో తగు సూచనలు, సలహాలు వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి పంట నమోదు కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. అలాగే రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యులు ప్రతి ఇంటికి వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆయన కోరారు. అలాగే వివిధ శాఖల అధికారులు తమకు సంబంధించిన వివరాలను సమావేశంలో వివరించారు. అలాగే చీనీ రైతులకు పులివెందుల మార్కెట్‌యార్డు ద్వారా సూట్ లేకుండా చీనీ కాయల విక్రయాలు జరుగుతున్నాయని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలనరసింహులు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, తాలూకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలి



తొండూరులో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ



వల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తొండూరు : బాల్య వివాహాల నివారణపై స్థానిక సాయిబాబా ఆలయం వద్ద నుంచి బస్టాండు వరకు విద్యార్థులు, అంగన్‌వాడీ వర్కర్లు, వెలుగు సిబ్బందితో శుక్రవారం ఎంపీడీఓ విష్ణుప్రసాద్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 సంవత్సరాలు పూర్తి అయితేనే వివాహాలు జరిపించాలన్నారు. చట్టవిరుద్ధంగా బాల్యవివాహాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ సరస్వతి, పంచాయతీ పీఆర్ ఇంజనీర్ లక్ష్మినారాయణరెడ్డి, పంచాయతీ సెక్రటరీ సాయినాథరెడ్డి, ఏపీఎం వెంకటనారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపాసాహెబ్‌పేటలో శుక్రవారం బాల్య వివాహాల నివారణపై ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహం చేసిన వాళ్ళకి రూ.లక్ష జరిమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందన్నారు. ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసిన వారికి, ప్రోత్సహించిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ తెలిపారు. శుక్రవారం లేటపల్లెలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో వివాహం చేస్తే తమ బాధ్యత తీరిపోయిందని తల్లిదండ్రులు భావిస్తారని, ఇది సరైన విధానం కాదన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జాకీర్, కిశోర బాలికలు, ఆశా, అంగన్‌వాడీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : బాల్య వివాహాలు అన్ని విధాలుగా అనర్థదాయకమని ఎంఈవో లిల్లెమ్మ తెలిపారు. వల్లూరు మండల కార్యాలయాల వద్ద శుక్రవారం బాల్య వివాహాల వలన నష్టాలను వివరిస్తూ నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం శిక్షను ఎదుర్కోవాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శైలజ, వైఎస్ఆర్ కేపీ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పార్వతి పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయండి

లింగాల : మండల పరిధి పార్నపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలన్నారు.

నేడు అప్పాయపల్లెలో..

కమలాపురం : 4వ వార్డు సచివాలయం పరిధిలోని కె.అప్పాయపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లతో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. 4వ వార్డు పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు లేబాకలో

వల్లూరు : మండలంలోని లేబాక గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించి వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు గురిజాలలో

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.